ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 వరంగల్
సోమవారం 1 జూలై 2024

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 30: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటల నుంచి జరుగనుంది. వరంగల్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్ సెల్) నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు స్వీకరించి త్వరగా పరిష్కారం చూపిస్తారని కమిషనర్ పేర్కొన్నారు.

పదవి దక్కేనా?





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నామినేటెడ్ పదవులపై ఉత్కంఠకు తెరపడింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజే ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ ప్రకటన జారీ చేసింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో ప్రభుత్వ ప్రకటన అమల్లోకి రాలేదు. దీంతో తమ పదవులు ఉన్నట్టా.. ఊడినట్టా? అనే టెన్షన్‌లో పదవులు పొందిన నేతలు, వారి అనుచరులు ఉన్నారు. గతంలో ప్రకటించిన నామినేటెడ్ పదవులు యథావిధిగా కొనసాగేలా ఉండడంతో ఇక ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో సీట త్యాగం చేసిన నేతలతో పాటు కీలక నేతలకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. దీంతో రాష్ట్రస్థాయి పదవులతో పాటు జిల్లాస్థాయి పదవులకు కూడా ఆశావహులు పోటీ పడుతుండటంతో కాంగ్రెస్‌లో నామినేటెడ్ కోలాహలం నెలకొంది.

ఆ ఆరు పదవులపై..

నామినేటెడ్ పదవులపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఇప్పటికే ప్రకటించిన జాబితాలో ఉన్నవారి పదవులు వారికేనని ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన తరువాత తొలిసారిగా మార్చి 16వ తేదీ రాత్రి 37మందితో నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. పదేళ్ల తరువాత అధికారంలోకి రావటంతో చాలా మంది సీనియర్ కాంగ్రెస్ నేతలు, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన నేతలు, ప్రొటోకాల్ కోసం పదవుల కోసం అనేక మంది ఎదురుచూశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అరుగురికి రాష్ట్ర స్థాయి పదవులతో పాటు కీలకమైన కూడా చైర్మన్ పదవులను ప్రకటించింది. దీంతో వీరి అనుచరుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. అయితే అదే రోజు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన రావడంతో అధికారికంగా ప్రకటన వెలువడలేదు. ఇదిలా వుండగా, లోక్‌సభ ఎన్నికల్లో అనేక మంది ఎంపీ టికెట్ ఆశించారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం చాలామందికి నామినేటెడ్ పదవులను ఆశ చూపి టికెట్ పోటీ నుంచి తప్పించింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల అనంతరం తమ పదవులు తమకే దక్కుతాయా..? మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేరేవారికి వస్తాయా? అనే ఉత్కంఠ గతంలో నామినేటెడ్ పదవులు పొందిన నేతల్లో నెలకొంది. ఈ క్రమంలో గతంలో ప్రకటించిన నామినేటెడ్ జాబితాలో ఉన్నవారికే పదవులని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో ఉత్కంఠకు తెరపడింది. దీంతో మంచి ముహూర్తం చూసుకుని ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పదవుల కోసం ఒత్తిళ్లు

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ త్యాగం చేసిన నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దొమ్మాటి సాంబయ్యకు ఎంపీ టికెట్ దాదాపు ఖరారైందనే వార్తలు వినిపించినప్పటికీ చివరి నిమిషంలో చేజారింది. దీంతో సాంబయ్యకు కీలకమైన రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి లభిస్తుందనే చర్చ జరుగుతోంది. అలాగే డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ సైతం టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఆయనకు కూడా నామినేటెడ్‌లో కీలకమైన పదవిని ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. వీరితో మరో ఇద్దరు, ముగ్గురు నేతలు కూడా ఎంపీ టికెట్‌ను త్యాగం చేసి అభ్యర్థి గెలుపు కోసం

▸▸ మిగతా 6వ పేజీలో..

- కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల కోలాహలం
- ఇప్పటికే ప్రకటించిన వారికి పదవులు పదిలం
- ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురికి 'కార్పొరేషన్' పదవులు
- సర్కారు సానుకూలతతో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు
- టికెట్ త్యాగం చేసిన, ఇతర కీలక నేతలకు అవకాశం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్థాయి పదవులకు డిమాండ్

ఆరు నామినేటెడ్ పదవులు వీరికే..

అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల టికెట్ ఆశించి భంగపడిన ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కూడా) చైర్మన్ పదవి దక్కింది. వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా పదవి దక్కింది. రియాజ్‌కు రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్యనాయక్‌కు గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే ములుగు మాజీ ఎమ్మెల్యే పోడెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్



మనుగొండలో పంట సాగును పరిశీలిస్తున్న డీఏవో

గీసుగొండ, జూన్ 30: పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. మండలంలోని ఎలుకుర్తి, మనుగొండ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పంటల నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు వరి పంట సాగులో తగిన మెళకువలు పాటించాలన్నారు. దీర్ఘకాలిక వరి రకాలకు నారు పోసుకొని సమయం దాటినందున మధ్యకాలిక రకాలను సాగు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగం, టెక్నికల్ అధికారి శ్రీధర్, ఏవో హరిప్రసాద్ బాబు, ఏఈవో విజయ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు

▸▸ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

▸▸ ఘనంగా బ్యాంకు 28వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

పోచమ్మమైదాన్, జూన్ 30 : వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ దేశాయిపేట రోడ్డులోని కేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు 28వ మహాజన సభ ఘనంగా నిర్వహించారు. బ్యాంకు పాలకమండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు 27 వసంతాలు పూర్తిచేసుకొని 28వ మహాజన సభ జరుపుకోవడం గర్వకారణమన్నారు. బ్యాంకు స్థాపించినప్పటి నుంచి ఎన్నడూలేని విధంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో పురోగతి సమీక్షించిన తరువాత బ్యాంకు పటిష్టమైన స్థితిలో ఉందని తెలిపారు. ఖాతాదారుల కోసం మరిన్ని మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని, వరంగల్ శాఖ కింది అంతస్తులో రెండు ఏటీఎంలు ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలో నాలుగు నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి లభించిందని, బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా బ్యాంకు నేతృత్వంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. బ్యాంకు అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గం శ్రేణులు తోట జగన్నాథం, తోట సంపత్ కుమార్, మహ్మద్ గౌసుద్దీన్, బొమ్మినేని పాపిరెడ్డి, పొన్నా హరినాథ్, ఎం.సత్యనారాయణ, డీసీవో సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కర్షకుల రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం

▸▸ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు దేవేందర్‌రావు



దమ్మన్నపేటలో మాట్లాడుతున్న కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు

వర్ధన్నపేట రూరల్, జూన్ 30 : రాష్ట్రంలో కర్షకుల రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు అన్నారు. మండలంలోని దమ్మన్నపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకమని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతు డిక్లరేషన్ పేరిట చేసిన హామీని నెరవేరుస్తూ తెలంగాణ కేబినెట్ భేటీలో ఆమోద ముద్ర వేయించి రైతులకు రుణమాఫీ అందేలా చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా రైతులు, నియోజకవర్గం పక్షాన దేవేందర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు పోశాల వెంకన్నగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, నాయకులు మరుపట్ల సాయికుమార్, చీరబోయిన రాజు, అబ్బిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ గడువు పొడిగింపు

▸▸ ఎంపీ కావ్య విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

▸▸ మనోహర్‌లాల్ ఖట్టర్, సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ కావ్య కృతజ్ఞతలు



ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసిన ఎంపీ కడియం కావ్య (ఫైల్)

హనుమకొండ సిటీ, జూన్ 30: వరంగల్ స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పొడిగించాలన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు 2025, మార్చి 31 వరకు గడువును పొడిగిస్తూ కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డాక్టర్ కడియం కావ్య కృషి ఫలించింది. జూన్ 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఎంపీ కావ్య.. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఢిల్లీలో కలిశారు. వరంగల్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులు కొన్ని ముగింపు దశకు చేరుకోవడం, మరికొన్ని పనులు కొనసాగడం, పెండింగ్ పనులు ఉండడాన్ని ఎంపీ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో గడువు పొడిగించడం ద్వారా వరంగల్ మహానగర అభివృద్ధికి మేలు చేసిన వారు అవుతారంటూ కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అంతే కాకుండా మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను పలుమార్లు ఈ విషయమై సంప్రదించారు. స్మార్ట్‌సిటీ గడువు పొడిగింపుపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ పరిణామం వరంగల్ మహానగరాభివృద్ధికి ఎంతో ఉపయుక్తం కానుంది. కాగా, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు గడువు పొడిగించడంపై ఎంపీ కడియం కావ్య కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు.

సోలార్‌తో ఆదా..

- సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ
- గృహావసరాల మినహా మిగులు ఉత్పత్తికి డిస్కం డబ్బులు చెల్లింపు
- 20 ఏళ్ల వరకు బిల్లుల భారం తప్పించుకోవచ్చు
- సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు ఒప్పందాలకు డిస్కం దూరం..?

హనుమకొండ టౌన్, జూన్ 30 : విద్యుత్ ఆదాతో పాటు నెలవారీ కరెంట్ బిల్లులను తగ్గించుకునేందుకు వినియోగదారులు సోలార్ వైపు అడుగులు వేస్తున్నారు. థర్మల్ పవర్‌స్టేషన్స్‌లో తయారయ్యే విద్యుత్ డిమాండ్‌ను తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని అరికట్టి గ్రీన్ ఎనర్జీని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ స్కీంలో భాగంగా సోలార్‌పై సబ్సిడీని అందిస్తోంది. ఈ క్రమంలో చాలామంది వినియోగదారులు సోలార్‌ను ఏర్పాటు చేసుకొని జీరో బిల్లులు పొందడమే కాకుండా వారి సోలార్ ప్యానల్స్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు ఎన్పీడీసీఎల్ నుంచి డబ్బులు పొందుతున్నారు. సూర్యఘర్ స్కీంలో భాగంగా దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్‌లు చేరుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా ఆ లక్ష్యాన్ని దాటినట్లుగా డిస్కం అధికారులతోపాటు సోలార్ అథరైజ్డ్ వెండర్స్ వెల్లడిస్తున్నారు. గృహావసరాలకు సూర్యఘర్ ద్వారా కేంద్రప్రభుత్వం రాయితీలు ఇచ్చినట్లు, సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటుకు డిస్కంలు ముందుకొచ్చి ఉత్తత్తి అయ్యే విద్యుత్‌ను కొనుగోలు చేస్తామని ఒప్పందాలు చేసుకుంటే రానున్న రోజుల్లో విద్యుత్ కొరత లేకుండా చూడొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.



సోలార్ కనెక్షన్ పొందడం ఎలా..?

గతంలో రెడ్-కో నోడల్ ఏజెన్సీ ద్వారా సోలార్ కనెక్షన్‌లకు వినియోగదారులు దరఖాస్తులు చేసుకోగా ఏజెన్సీ వారే అన్నీ చూసుకొని కనెక్షన్ ఇప్పించేవారు. ప్రస్తుతం నేషనల్ పోర్టల్ ద్వారా వినియోగదారుడు ఆధార్, విద్యుత్‌బిల్లు, అడ్రస్‌తో దరఖాస్తు చేసుకుంటే ఎలక్ట్రిసిటీ అధికారులు వినియోగదారుడి అడ్రస్‌ను సందర్శించి ఎంత లోడ్ ఉంది? ఎన్ని కిలోవాట్స్‌కు అనుమతులు ఇవ్వాలనేది పరిశీలించి ఫిజిబిలిటీ సర్టిఫికెట్ ఇస్తే దాని ద్వారా అథరైజ్డ్ సోలార్ వెండర్ వచ్చి సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్ బిగించి కనెక్షన్ ఇచ్చి సోలార్ మీటర్ ఏర్పాటు చేస్తారు. గతంలో ఎలక్ట్రిసిటీ అధికారులు ఫిజిబిలిటి సర్టిఫికెట్ ఇస్తేనే వెండర్స్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి అనుమతి ఉండేది. కాగా, కేంద్రంలోని మినిస్టరీ ఆఫ్ న్యూ రెన్యూబుల్ ఎనర్జీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఈఆర్‌సీ 10 కిలోవాట్స్ లోపు ఎలాంటి ఫిజిబిలిటీ అవసరం లేదని డిస్కంలకు ఉత్తర్వులు జారీచేశారని ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 17.4 మెగావాట్స్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 1,497 సోలార్ కనెక్షన్స్ ఉండగా, 17.4 మెగావాట్స్‌ను సోలార్ ద్వారా వినియోగదారులు వాడుతున్నారు. సూర్యఘర్‌లో భాగంగా 22 కనెక్షన్స్ కొత్తగా గృహావసరాలకు అనుమతులు పొంది సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) ద్వారా ఎన్పీడీసీఎల్ పరిధిలో సోలార్ ద్వారా ఉత్పత్తి అవుతున్న 1,013 మెగావాట్స్ విద్యుత్‌ను ఎన్పీడీసీఎల్ కొనుగోలు చేస్తుండగా, రెన్యూబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లికేషన్ (ఆర్‌పిపిఓ) స్కీంలో భాగంగా ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు 2 మెగావాట్స్ విద్యుత్‌ను సోలార్ ద్వారా ఉత్పత్తి చేసుకొని వారి కంపెనీలకు సరఫరా చేసుకుంటున్నారని ఎన్పీడీసీఎల్ వర్గాలు చెప్తున్నాయి. 3కిలో వాట్స్ ప్రతి రోజు 12 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా చాలా మంది వినియోగదారులు పొదుపుగా విద్యుత్‌ను వినియోగిస్తూ ఎన్పీడీసీఎల్ నుంచి డబ్బును పొందుతున్నారు. సోలార్ (నెట్) మీటర్‌లో ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ రెండు రీడింగ్‌లను తీసి సోలార్ ఉత్పత్తికి కంటే వినియోగదారుడు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే వినియోగదారుడు బిల్లు చెల్లించడం, తక్కువ వినియోగిస్తే విద్యుత్‌శాఖ 6 నెలలకు ఒకసారి మిగులు ఉత్పత్తిపై ఒక్క యూనిట్‌కు 4.99 పైసల చొప్పున చెక్‌రూపంలో డబ్బులు చెల్లించడం జరుగుతుంది. కాగా ఒక్కసారి ప్యానల్‌కు పెట్టిన పెట్టుబడి మూడేళ్లలో తీరిపోతుందని మిగితా 20 సంవత్సరాలు ఉచితంగా జీరో బిల్లుపై విద్యుత్‌ను వినియోగించుకొవచ్చని అథరైజ్డ్ వెండర్స్ అంటున్నారు.

సబ్సిడీపై సోలార్ పలకలు

కేంద్ర ప్రభుత్వం థర్మల్ పవర్ ప్లాంట్స్ నుంచి వచ్చే పోల్యూషన్‌ను అరికట్టడంతో పాటు వినియోగదారులు విద్యుత్‌ను ఆదా చేయడం తద్వారా బిల్లులను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సాహించేవిధంగా పీఎం సూర్యఘర్ స్కీం ద్వారా 78,000 వరకు రాయితీని ప్రకటించింది. ఒక కిలోవాట్‌కు 30,000 చొప్పున 3 కిలోవాట్స్ అంతకంటే ఎక్కువ వాట్స్ వరకు 78,000 రాయితీని కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది. సుమారుగా నెలకు 3000 నుంచి 4,000 బిల్లు వచ్చే వినియోగదారులకు సోలార్ విద్యుత్ బాగా పనిచేస్తుందని, ఒకసారి సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకున్నట్లయితే 25 సంవత్సరాలకు వరకు పనిచేస్తుందని 3 కిలో వాట్స్ పై పెట్టిన పెట్టుబడి 3 నుంచి 4 సంవత్సరాల్లో తీరిపోగా మిగితా 20 ఏళ్లు ఉచితంగా కరెంట్‌ను పొందొచ్చని అథరైజ్డ్ సోలార్ వెండర్స్ పేర్కొంటున్నారు. ప్యానెల్స్‌ను 15 రోజులకొకసారి శుభ్రం చేసుకుంటూ, సూర్యుని వేడి పలకలపై పడేట్లు ఉత్తరం నుంచి దక్షిణం వైపు ఏటవాలుగా ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఉత్పత్తి తగ్గకుండ రోజుకు ఒక్క కిలోవాట్‌కు 4యూనిట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వెండర్స్ సూచనలు చేస్తున్నారు.

సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు ఒప్పందాలకు డిస్కం దూరం..?

విద్యుత్ కొరతను తీర్చడంతో పాటు గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఖాళీ ప్రదేశాల్లో రైతులు లేదా వ్యాపారులు సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకొని డిస్కంలకు విద్యుత్ విక్రయించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలంటే ముందుగా ప్లాంట్‌ల నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తామని డిస్కం ఒప్పందం చేసుకొవాలి దానికి డిస్కం ముందుకురావడం కానీ, ప్రయత్నాలు చేయడం కానీ ఏమి చేస్తలేదని విమర్శలు వస్తున్నాయి. ఆ దిశగా ముందుకేళ్తే విద్యుత్ కొరతను తీరడంతో పాటు రైతులకు, వ్యాపారులకు ఆదాయ వనరులు కల్పించడం, గ్రీన్ ఎనర్జీని ప్రొత్సాహించినవాళ్లవుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

ఐనవోలు, జూన్ 30: రోడ్డు పక్కన ఉన్న బీటెక్ ద్యార్థినిని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో విద్యార్థి కాలు కోల్పోయిన సంఘటన పున్నేలు క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఒంటి మామిడిపల్లి గ్రామానికి చెందిన మామిండ్ల అభిలా ష్. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసి హైదరాబాద్‌లో ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ పొందాడు. ఆదివారం ఉద యం 10గంటలకు సొంత పనిపై బైక్‌పై పున్నేలు క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో విశాఖపట్నం నుంచి రాజస్థాన్‌కు కర్రలోడుతో వెళ్తున్న లారీ అతివేగంతో వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న అభిలాష్ బైక్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో అభిలాష్ ఎడమకాలు తొంటి వరకు నుజ్జునుజ్జు కాగా, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించి అక్కడి ను ంచి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి కాలును తొలగించేందుకు సిద్ధపడ్డారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.


లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో నుజ్జు నుజ్జుగా మారిన అభిలాష్ కాలు

జూలై 1 నుంచి ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 21: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్-2023 వార్షిక పరీక్షలు జూలై 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 3, 5, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూలై 9 నుంచి 14 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని గ్రూపుల వారిగా కేటయించిన సమయంలో పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఎంపీపీ తిరుపతిరెడ్డిపై మరో కేసు

శాయంపేట, జూన్ 30: ఎంపీపీ మెతుకు తిరుతిరెడ్డిపై మరో చీటింగ్ కేసు నమోదైంది. పాస్‌బుక్‌లో భూమి వివరాలు ఎక్కిస్తానని ఓ వ్యక్తి వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటనలో ఆదివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన చిలుకల సమ్మయ్యకు నేరేడుపల్లి రెవెన్యూ పరిధిలో 4.32 గుంటల భూమిలో 2.12 గుంటల భూమి పాస్ బుక్‌లో ఎంట్రీ ఉంది. మిగతా భూమి ఎంట్రీ కాలేదని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఈ క్రమంలో ఆదే గ్రామానికి చెందిన ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తనకు రూ.50 వేలు ఇస్తే మిగతా భూమి పాస్‌బుక్‌లో ఎక్కిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో సమ్మయ్య అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వేణు అనే వ్యక్తి ద్వారా ఎంపీపీకి రూ.50 వేలు ఇచ్చాడు. మూడు సంవత్సరాలు గడిచినా బుక్‌లో భూమి వివరాలు ఎక్కించలేదు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని సమ్మయ్య ఎంపీపీని ఎన్నిసార్లు అడిగినా కాలం గడుపుతూ వస్తున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి వేణులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇటీవల మండలంలోని ఓ వ్యక్తికి దళిత బంధు కోసం ఎంపీపీ రూ.లక్ష వసూలు చేశారనే ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా రిమాండ్ విధించారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న ఎంపీపీపై మరో కేసు నమోదు కావడం మండలంలో చర్చనీయాంశమైంది.

నామినేటెడ్ పదవి దక్కేనా?

(5వ పేజీ తరువాయి)

పని చేశారు. వీరికి కూడా నామినేటెడ్‌లో న్యాయం చేస్తారనే ఆశతో ఉన్నారు. ఇక పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సిరెడ్డి నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి అధిష్ఠానం సూచనలతో కావ్యకు మద్దతుగా నిలిచిన స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరకు, జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి నామినేటెడ్ పోస్టులు ఖాయంగా ప్రచారం జరుగుతోంది. అలాగే మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, నమిండ్ల శ్రీనివాస్, కె.రవళిరెడ్డికి కూడా కీలకమైన పోస్టు దక్కుతుందని ప్రచారం ఉంది. అలాగే భూపాలపల్లి జిల్లాకు చెందిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ పరకాల టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే పార్టీ అదేశాల మేరకు తప్పుకుని భూపాలపల్లి, పరకాల, ములుగు అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించింది. అయితే అశోక్‌కు కీలకమైన నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని మంత్రి సీతక్కతోపాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అలాగే పరకాలకు చెందిన సీనియర్ నేత, సీఎంకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న మార్క విజయ్‌కుమార్‌కు సైతం నామినేటెడ్ పదవి దక్కుతుందనే చర్చ సాగుతోంది. అలాగే మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవుల కోసం మీసాల ప్రకాష్, నల్లగొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్ తదితర నేతలు ఆశతో ఉన్నారు. అలాగే మరో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నుంచి కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితర నేతలకు నామినేటెడ్ పదవులు వస్తాయనే చర్చ జరుగుతోంది. నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల నుంచి పదవులు ఆశిస్తున్నవారి సంఖ్య డజనుకు పైగా ఉంది. రానున్న రెండు, మూడు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి పోస్టులను కూడా భర్తీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కరసరత్తు చేస్తోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, ఎంపీపీ పదవులపై ఆశలు లేని నేతలు.. జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ చైర్మన్ లాంటి పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టిసారిస్తున్నారు. వీటితోపాటు కార్పొరేషన్‌లకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవులు కూడా ఉండటంతో వాటిలో ఏదో ఒకటి రాకపోతుందా? అనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉండి పార్టీని కాపాడుకుంటూ వస్తున్నవారికి నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశాలు వస్తాయనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

అనధికారిక రేషనలైజేషన్‌ను

సత్వరమే నిలిపివేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 30: రాష్ట్రంలో విద్యాశాఖాధికారులు చేపడుతున్న అనధికారిక రేషనలైజేషన్‌ను సత్వరమే నిలిపివేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో భోగేశ్వర్ మాట్లాడారు. గ్రామానికో పాఠశాలను తెరుస్తామని, ఓ ఒక్క ప్రభుత్వ పాఠశాలను మూసివేయమని ముఖ్యమంత్రి చెబుతుంటే అందుకు విరుద్ధంగా విద్యాశాఖాధికారులు వ్యవహరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ముఖ్యమంత్రి మాటలను హామీలకే పరిమితం చేస్తారా? అని అధికారులను ఆయన ప్రశ్నించా రు. ఎస్జీటీ, తత్సమాన బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ గా ఉందనే సాకుతో ఉన్న పోస్టులను దాచిపెట్టడాన్ని ఆయ న ఖండించారు. సరిపడా ఉపాధ్యాయులు లేకుండా పిల్లలెలా వస్తారని ప్రశ్నించారు. తల్లిదండ్రులకు విశ్వాసం కలిగే విధంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపే తం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో సైతం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో అధికారులు ఉన్న ఖాళీలను దాచిపెట్టారని ఆరోపించారు. అధికారులను అడ్డు పెట్టుకొని ప్రభుత్వం దొంగచాటుగా



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

చేపడుతున్న రేషనలైజేషన్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ పోస్టుల అనధికారిక రేషనలైజేషన్‌ను టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బదిలీల వెబ్ ఆప్షన్లకు మరో రోజు గడువు పొడిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, పి.మనోజ్, ఉపాధ్యక్షుడు జె.స్వామి, కార్యదర్శి బుచ్చాచారి, నాయకులు ఈ.వీరస్వామి, జి.లక్ష్మీపతి, బి.పూర్ణచందర్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో మహిళ

ఆస్పత్రికి తరలించి, విచారణ చేపట్టిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 30 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివార్లలోని నిర్మానుష ప్రదేశంలో వివాహిత (25) అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ వెంటనే ఆమెను జిల్లా ప్రధానఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన వివాహితగా ప్రాథమిక సమాచారాన్నిబట్టి తెలుస్తోంది. గత కొద్దికాలం కిందట భారాభర్తల మధ్య భేదాభిప్రాయాలు రావడంతో ఆమె ఒంటరిగానే జీవిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెను మహబూబాబాద్‌కు ఎవరు తీసుకువచ్చారు.? ఎలా వచ్చింది! ఇల్లందు రోడ్డులోని క్రషర్ మిల్లు సమీపంలోని నిర్మానుష ప్రదేశంలో అపస్మారక స్థితిలో ఎందుకు పడి ఉంది అనేది తెలియాలంటే ఆమె స్పృహలోకి వచ్చిన తర్వాతే వెల్లడిస్తామని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు విలేఖరులకు చెప్పారు.

అటకెక్కిన అల్పాహారం

- పాఠశాలలు ప్రారంభమై 17 రోజులు గడుస్తున్నా ఇంకా ప్రారంభం కాని అల్పాహారం
- ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు లేవంటున్న అధికారులు
- నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లోనే..

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 30: పాఠశాల విద్యార్థులకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అల్పాహార కార్యక్రమం అటకెక్కింది. అప్ప టి ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఏడాది అక్టోబర్‌లో పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందజేసేందుకు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన కార్య క్రమం ప్రస్తుతం ప్రభుత్వంలో రూపం లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేద విద్యార్థులకు, ఉదయాన్నే ఖాళీ కడుపుతో వచ్చే విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే పాఠశాలలు ప్రారంభమై 17రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మాత్రం పాఠశాలల్లో అల్పాహారం కార్యక్రమం ప్రారంభమే కాలేదు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కాకుండా దశల వారిగా ఎంపికచేసిన పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రమే అల్పాహారాన్ని అందజేశారు. వరంగల్, హనుమకొండ, నర్సంపేట, తదితర పట్టణప్రాంతాల్లోని పాఠశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులే ఏర్పాటు చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన డిసెంబర్ నుంచి మార్చి వరకు అల్పాహారం బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమం ప్రారంభం చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని, ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.



ఖాళీ కడుపుతోనే..

అల్పాహార కార్యక్రమం పేద పిల్లలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే తల్లిదండ్రుల పిల్లలకు ఉపయుక్తంగా ఉండేది. ఇప్పుడు పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమం నిలిపివేయడంతో అలాంటి విద్యార్థులు ఖాళీ కడుపులతోనే మధ్యాహ్నం వరకు చదువుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుతండటం వారికి అల్పాహారం అత్యవసరం అనే అభిప్రాయాలు వ్యక్తం అందుతున్నాయి.

అల్పాహారం.. బలవర్ధకం..

పాఠశాల విద్యార్థుల పెరుగుదలకు, చురుకుదనానికి అవసరమయ్యే బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందనే అభిప్రాయాలను న్యూట్రిషనలిస్టులు చెబుతున్నారు. నిపుణుల సూచనలతోనే అల్పాహార మెనూను సైతం అధికారులు రూపొందించారు. మిల్లెట్ ఉప్మా, ఇడ్లీ సాంబారు తదితర పౌష్టికాహార పదార్థాలతో మెనూను రూపొందించారు.

నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లోనే..

గత విద్యా సంవత్సరానికి సంబంధించిన నాలుగు నెలల అల్పాహార బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వరంగల్ జిల్లాలో డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చికి చెందిన రూ.66 లక్షల 32వేల బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నా యి. ఇక హనుమకొండ జిల్లాలో సైతం నాలుగు రూ.25 లక్షల 51 వేల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఇలా..

వరంగల్ జిల్లాలో దశల వారిగా మొత్తం 95 పాఠశాలల్లో సుమారు 8 వేల మంది విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ అమలు చేశారు. ఇందులో 35 పాఠశాలల్లో అక్షయ పాత్ర ఫౌండేషన్ వారు బ్రేక్‌ఫాస్ట్ అందజేయగా, మిగతా 60 పాఠశాలల్లో సంబంధిత పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజన కార్మికులు అందజేశారు. ఇక హనుమకొండ జిల్లాలో మొత్తం 60 పాఠశాలల్లో సుమారు 6,500మంది విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. వీటిల్లో 10 పాఠశాలల్లో అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా అందజేయగా, మిగతా 50 పాఠశాలల్లో సంబంధిత మధ్యాహ్న భోజన కార్మికులే అందజేశారు.

అల్పాహారాన్ని అందజేయాలి..

పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని న్యూట్రిషన్ నిపుణులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే మంచి కార్యక్రమ ప్రారంభంపై ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు అందజేస్తాం..

అల్పాహారం ప్రారంభంపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలుగాని, మార్గదర్శకాలు గాని రాలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని రెండు జిల్లాల విద్యాశాఖాధికారులు చెబుతున్నా రు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దశలవారిగా పాఠశాలల్లో అల్పాహారం అందజేశాము. ప్రభుత్వం అల్పాహారంపై ఏవైనా ఉత్తర్వులు జారీ చేస్తే వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

పనిచేయని హెచ్‌డీఎస్‌లు

- నిధులలో కోత
- రూ 1.70 లక్షల నుంచి రూ.80 వేలకు తగ్గింపు
- పీహెచ్‌సీలకు కరవవుతున్న మౌలిక సదుపాయాలు
- రోగులకు అందని మెరుగైన వైద్యం

హనుమకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లకు ఇచ్చే నిధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోత పెడుతున్నాయి. మూడేళ్లుగా ఈ నిధుల మొత్తం తగ్గుతూ వస్తోంది. దీంతో పీహెచ్‌సీల నిర్వహణ కష్టంగా మారుతోంది. నిధుల లేమి వల్ల వాటిల్లో మౌలిక సదుపాయాలను కల్పించలేని దయనీయ స్థితి నెలకొని ఉన్నది. పీహెచ్‌సీ భవనాలకు కనీస మరమ్మతులు సైతం చేయలేని దుస్థితి. దీంతో అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటు న్నాయి. భవనంపై కప్పులు ఊడి పడిపోతున్నాయి. పీహెచ్‌సీల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలకు ఏవైనా మరమ్మతులు చేయాల్సి వస్తే వాటిని ఎప్పటిప్పుడు చేయలేకపోతున్నారు. కనీసం చెడిపోయిన ఫ్యాన్లను మరమ్మతులు చేసే దిక్కులేదు. ఇక వైద్య పరికరాల పరిస్థితి మరీ దారుణం. సాంకేతిక లోపాలు ఏర్పడి సరిగా పని చేయలేకపోవడంతో డాక్టర్లు, సిబ్బంది తరుచూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

తగ్గుతున్న నిధులు

పీహెచ్‌సీలకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) నిధులుగా ఒక్కోదానికి గతంలో ఏటా 1.50లక్షల నుంచి రూ.1.75లక్షల వరకు వచ్చేవి. స్థానిక ఎంపీపీ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశమై ఆమోదించిన తీర్మానాల మేరకు ఈ నిధులను అవసరాల ప్రాతిపదికగా ఖర్చు చేసేవారు. కానీ గత రెండు, మూడేళ్లుగా హెచ్‌డీసీ నిధుల మొత్తం తగ్గుతూ వస్తోంది. ఈ నిధుల మొత్తాన్ని రూ.1.50 లక్షల నుంచి రూ.1లక్షకు తగ్గించారు. ఆతర్వాత మరింతగా రూ.80వేలకు తగ్గింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 67 పీహెచ్‌సీలు పని చేస్తున్నాయి. హనుమకొండ జిల్లాలో 17, వరంగల్ జిల్లాలో 17, జనగామ జిల్లాలో 16, మహబూబాబాద్ జిల్లాలో 21, ములుగు జిల్లాలో 15, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 13 ఉన్నాయి. వీటికి గతలో ఏటా రూ.1.17 కోట్ల వరకు హెచ్‌డీసీ నిధులు వచ్చేవి. ఇప్పుడు సగానికి సగం తగ్గిపోయి రూ.53లక్షల వరకు వస్తున్నాయి. అవి కూడా సకాలంలో రావడం లేదు. ఈ నిధుల్లో కేంద్రం తన వంతువాటాగా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా 40 శాతం కలిపి విడుదల చేయాల్సి ఉంటుంది. గత మూడేళ్లుగా శానిటేషన్ (అన్‌టైడ్) నిధులూ నిలిచిపోయాయి. ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు కాకపోవడంతోనే సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయా వైద్యాధికారులు, కమిటీ చైర్మన్లు చెబుతున్నారు.

పట్టించుకోని హెచ్‌డీసీలు

ఆస్పత్రులకు వచ్చే రోగులకు స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించడంతోపాటు దవాఖానాను మెరుగ్గా నిర్వహించేందుకు ఉద్దేశించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు (హెచ్‌డీఎస్)లు ఉమ్మడి జిల్లాలో పని చేయడం లేదు. సామాజిక ఆస్పత్రులకు ఎమ్మెల్యేలు, జిల్లా ఆస్పత్రులకు కలెక్టర్లు, జడ్పీ చైర్మన్లు అధ్యక్షులుగా ఉంటారు. ఆస్పత్రుల్లో ఏ పని చేయలేని దుస్థితి నెలకొంది. రాబోయేది వర్షాకాలం. వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. ఆస్పత్రులు మాత్రం నామమాత్రంగా మారాయి.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సమావేశాలు ఏవీ?

అస్పత్రి అభివృద్ధి కమిటీలు మూడు నెలలకోసారి సమావేశం కావాలి. కానీ ఎక్కడా అలా జరగడం లేదు. ఆస్పత్రుల్లో సరిపడా పడకలు, నీరు, తాగునీరు, ఫ్యాన్లు లేవు. పారిశుధ్యం అధ్వాన్నంగా మారుతోంది. కొన్ని ఆస్పత్రులు పాతభవనాల్లోనే ఇంకా నడుస్తుండడంతో వాటి పెచ్చులు ఊడుతున్నాయి. వర్షం వస్తే పైకప్పు నుంచి నీళ్లుకారి ఆస్పత్రులు జలమయమవుతున్నాయి. రోగులు పడుకునే పడకలపైనే ఉరుస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్యలను విన్నవించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. స్థానిక ఎంపీపీలు ఆస్పత్రులకు చైర్మన్లుగా వ్యవహరిస్తారు. వారి పదవీకాలం సైతం ఈ నెలతో పూర్తవుతోంది. ఆ వెంటనే ప్రాదేశిక ఎన్నికలు జరిగే సూచనలు కనిపించడం లేదు. డిసెంబర్‌లో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు పీహెచ్‌సీల హెచ్‌డీసీలకు అధ్యక్షులు లేని పరిస్థితి ఏర్పడనున్నది.

దంపతుల ఆత్మహత్యాయత్నం

● భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

నెల్లికుదురు, జూన్ 30: అవమానం భరించలేక దంపతులు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. భార్య మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి శివారు పెద్దతండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతండాకు చెందిన బానోత్ నీలమ్మ (36), అదే తండాకు చెందిన బానోత్ వీరన్న మధ్య వివాహేతర సంబంధం ఉంది. శనివారం రాత్రి వీరన్న తండాలోని నీలమ్మ ఇంటికి వెళ్లి ఆమెను బలత్కారం చేయడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో వీరన్నతో నీలమ్మ భర్త భద్రు గొడవ పడ్డాడు. దీంతో అవమానం భరించలేక నీలమ్మ ఇంట్లో ఉన్న పురుగులమందు తాగగా, వెంటనే భర్త భద్రు సైతం అదే పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. నీలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, భద్రును మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు సోదరుడు బాదావత్ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నీలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.


మృతురాలు బానోత్ నీలమ్మ

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ఆత్మకూరు, జూన్ 30 : రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని నీరుకుల్ల క్రాస్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్‌కు చెందిన యువకులు సంపత్, వినయ్‌లు ద్విచక్రవాహనంపై ములుగు జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కారును ఢీకొనడంతో సంపత్, వినయ్‌లకు గాయాలయ్యాయి. 108లో ఎంజీఎంకు తరలించారు.

ఇసుక లారీ బోల్తా..

మండలంలోని కటాక్షాపూర్ శివారులో ఆదివారం తెల్లవారుజామున ఇసుక లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ కటాక్షాపూర్ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

భూ తగాదాలలో

ఎస్‌ఐ జోక్యం

- వ్యక్తిని చితకబాదిన వైనం.. అతడిపైనే కేసు
- శాయంపేట పీఎస్‌లో ఘటన

శాయంపేట, జూన్ 30: అన్నదమ్ముల మధ్య ఉన్న భూ తగాదాల విషయంలో ఎస్‌ఐ ఒకరిని ఇష్టం వచ్చినట్లు తిడుతూ చితకబాదగా బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో సొమ్మసిల్లి పడి పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు బాధితుడిపైనే కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మాందారి పేట గ్రామానికి చెందిన లక్కర్సు రమేష్‌కు, తన తమ్ముడైన మొగిలి మధ్య కొన్నేళ్లుగా భూ తగాదాలు ఉన్నాయి. ఇటీవల మొగిలి.. తన అన్న రమేష్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రమేష్ కూడా తమ్ముడిపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రమోద్‌కుమార్ భూమిని పరిశీలించి వెళ్లారు. అనంతరం ఈ నెల 26న ఎస్‌ఐ రమేష్‌ను పోలీసుస్టేషన్‌కు పిలిచాడు. రమేష్ రాగా, ఎస్‌ఐ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేశాడు. దీంతో రమేష్ సొమ్మసిల్లిపడిపోయాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ రమేష్‌ను ఎస్‌ఐ మొద్దుకేసి గంట వరకు అలానే ఉంచారు. తర్వాత బయటకు వచ్చిన రమేష్ స్థానికంగా చికిత్స చేయించుకున్నాడు. అయితే ఏళ్లుగా తనకు అనారోగ్యం ఉందని, అకారణంగా ఎస్‌ఐ ప్రమోద్ కుమార్ తనపై దాడి చేశాడని బాధితుడు కన్నీటిపర్యం తమయ్యా రు. కాగా, ఈ ఘటనపై ఎస్‌ఐ ప్రమోద్‌ను వివరణ కోరగా.. మొగిలి ఫిర్యాదుతో రమేష్‌ను స్టేషన్‌కు పిలిచామని తెలిపారు. బెదిరించానే తప్ప కొట్టలేదన్నారు. ఇదిలా వుండగా, లక్కర్సు రమేష్ తన తమ్ముడైన మొగిలి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి దున్నాడని కేసు నమోదైంది. ఈ మేరకు ఈ నెల 17న మొగిలి ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.


వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు లక్కర్సు రమేష్

బడి బస్సులపై తనిఖీలేవి?

● ఫిట్‌నెస్ లేకున్నా రోడ్లపై ప్రయాణం ● విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ● దృష్టి సారించని ఉన్నతాధికారులు

వరంగల్ క్రైం, జూన్ 30 : నిబంధనలు విస్మరించి రోడ్లపైన ప్రైవేటు పాఠశాలల, కళాశాలల బస్సులు తిరుగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల బస్సులు రవాణాశాఖ నిబంధనలు ఏమాత్రం పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. హనుమకొండ జిల్లాలో ప్రైవేటు పాఠశాలల బస్సులు 1200 వరకు ఉన్నాయి. ఈ బస్సులు యేటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 15తో గత సంవత్సరం ఫిట్‌నెస్ ముగియగా 2024-25 గాను ప్రతీ బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నాకే రోడ్లపైకి రావాలి. పదమూడు రోజుల్లో 70శాతం బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తీసుకున్నట్లు సమాచారం. మిగతా బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే పిల్లలను పాఠశాలలకు తరలిస్తున్నారు. ఫిట్‌నెస్ ఇచ్చే ఆర్టీఏ అధికారులు బస్సుల కండీషన్ చూడకు ండానే సర్టిఫికెట్స్ జారీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. అందినకాడికి దండుకుంటున్న కిందిస్థాయి అధికారులు.. బస్సులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నిబంధనలు విస్మరించి..

ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న బస్సులను పరిశీలిస్తే ఆర్టీఏ అధికారుల చేతి వాటం స్పష్టంగా తెలుస్తోంది. బస్సులను పరిశీలించకుండానే వారిచ్చే ముడుపులు దండుకుని సర్టిఫికెట్ ఇస్తున్నట్లు కనిపిస్తోంది. నిబంధనల మేరకు బస్సు డ్రైవర్ 50 యేళ్ల వయస్సు దాటరాదు. బస్సులకు ఎమర్జెన్సీ డోర్ ఉండాలి, ప్రతీ బస్సుకు ఎంట్రెన్స్‌లో డోర్ తప్పనిసరిగా ఉండాలి, మెడికల్ కిట్, ఫైర్ సేఫ్టీ కిట్, హ్యాండ్‌బ్రేక్, డ్రైవర్ వివరాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రతీ బస్సు సర్వీసు 15 యేళ్లు మించ కూడదు. ఈ నిబంధనలు పాటించే బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ చేయాలి. దీనికి భిన్నంగా శాఖ అధికారుల తీరుంటుంది. బస్సులను పరిశీలించకుండానే సర్టిఫికెట్స్ ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.


దోర్ లేకుండా పిల్లలతో వెళుతున్న బస్సు

పిల్లల ప్రాణాలతో చెలగాటం

పాఠశాలల యాజమాన్యాలు, శాఖ అధికారులు పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి. నగరంలో తిరుగుతున్న బస్సులకు కనీసం ఎంట్రెన్స్‌లో డోర్ సైతం ఉండటం లేదు. డోర్ సమీపంలోని సీట్లో కూర్చునే పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నప్పటికీ పట్టించుకోకపోవడం విశేషం. బ్రేక్ వేస్తే పిల్లలు కింద పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లోపల నిబంధనలు దేవుడెరుగు.. కనీసం డోర్‌లు ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. వాస్తవంగా పాఠశాలల ప్రారంభంలో బస్సులు తనిఖీలు చేయాలి. నిబంధనలు పాటించని బస్సులు సీజ్ చేయడం, జరిమానాలు వేయడం జరగాలి. నగరంలో బస్సులు తనిఖీలు చేసిన దాఖలు కనిపించదు. మొత్తంగా ప్రస్తుతం నగరంలో ఉన్న చాలా బస్సుల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండానే రోడ్లపైన తిరుగుతున్నా యి. ప్రమాదాలు జరిగాక హడావుడిపడడం కంటే ప్రమాదాలు జరుగకముందే ముందు జాగ్రత్తగా తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. నిబంధనలపై డ్రైవర్లకు, అవగాహన తరగతులు నిర్వహించామని తెలిపారు. నిబంధనలు విస్మరించి రోడ్లపైకి వస్తున్న బస్సులను సీజ్ చేస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ తమ హక్కులు కాపాడుకోవాలి

● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్


కేయూలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్, జూన్ 30: ప్రతి ఒక్కరూ తమ హక్కుల కాపాడుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సూచించారు. ఆదివారం కేయూ సెనెట్‌హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ స్టూడెంట్స్ మహాసేన నేతృత్వంలో సదస్సు జరిగింది. 'ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు- చట్టాలు' అనే అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ మాట్లాడారు. జాతీయ ఎస్సీ కమిషన్‌కు విస్తృతమైన అధికారులున్నాయని చెప్పారు. దళిత వర్గాలు తమ హక్కుల కాపాడటంలో తాము ముందుంటామని హామీ ఇచ్చారు. శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. క్యారెక్టర్ బిల్డింగ్‌తోనే ఏదైనా సాధ్యం అవుతుందని చెప్పారు. వరంగల్ నగరానికి గొప్పచరిత్ర ఉందన్నారు. ప్రొఫెసర్ బొబ్బిలి, డాక్టర్ పెండ్యాల వరవరరావు, బియ్యాల జనార్ధన్‌రావులాంటి అనేక మంది ఉద్యమనేతలను అందించిందని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా హక్కులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. వ్యవస్థను తప్పు పట్టవద్దని.. వ్యవస్థలో భాగమైన మనల్ని ప్రశ్నించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, గురువులు పెద్దలపై గౌరవం పెంచుకోవాలని అన్నారు. కేయూ నిధుల కొరత తీర్చేందుకు తన వంతుగా సహాయం చేస్తానని ప్రకటించారు. వర్సిటీలోని భూకబ్జాలపై విద్యార్థులు పోరాడాలని కోరారు. చట్టానికి లోబడి పనిచేయాలని, జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ టి.రాజమణి, డాక్టర్ టి.జయరాం, ఆరెపల్లి రాజేందర్‌లు మాట్లాడారు. మంచి సదస్సును ఏర్పాటు చేసిన విద్యార్థులను అభినందించారు. నిట్ ప్రొఫెసర్ కోలా ఆనంద్‌కిశోర్, కేయూ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, గాదేపాక అనిల్, గజ్జి దయాకర్, కేతవత్ కుమార్ పాల్గొన్నారు.

కేయూను సందర్శించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు

కాకతీయ యూనివర్సిటీని ఆదివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సందర్శించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ కేయూ పరిపాలన భవనం ఎదుట సాదరంగా ఆహ్వానం పలికి పుష్పగుచ్ఛం అందచేశారు. అంతకుముందు కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్సిటీలో తాజా పరిస్థితులపై చర్చించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.రాజమణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూరో సేవలు నిల్!

● సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో దక్కని వైద్య సేవలు ● గతంలో నిత్యం సర్జరీలు.. రెండు నెలలుగా జీరో సర్జరీలు

వరంగల్ మెడికల్, జూన్ 30: ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంతోపాటు కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సేవలు మిథ్యగా మారిపోయాయి. పేద రోగులకు న్యూరో సర్జరీ సేవలు అందని ద్రాక్షగానే ఉంటున్నాయి. ఉన్నతాధికారుల ఉదాసీనత పేద రోగులకు శాపంగా మారుతోంది. ఇక అత్యవసర కేసులు అయితే ఆగం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

మూతపడ్డ థియేటర్

కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రెండు నెలలుగా న్యూరో సర్జరీ విభాగం థియేటర్ మూతపడి ఉంది. ఆపరేషన్లు చేసేవారు లేక.. న్యూరో సర్జరీ రోగులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం హెచ్‌వోడీ చేసిన సర్జరీలన్నీ విఫలం అవుతున్నాయని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం 39 రోగులు న్యూరో సర్జరీ కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో న్యూరో సర్జరీలు ప్రతీ నెల 50 వరకు జరిగేవని గణాంకాల ద్వారా తెలుస్తోంది. నడుము, మెదడు సంబంధించిన సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. అప్పటి డాక్టర్ అసోసియేట్ పదోన్నతిపై బదిలీ కావడంతో సర్జరీలన్నీ కుంటుపడ్డాయని అంటున్నారు.

పోస్టులు పెంచాలి..

న్యూరో సర్జరీ విభాగంలో ప్రస్తుతం ఒక హెచ్‌ఓడీతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఒక్క ఎస్సార్‌తోపాటు కొందరు పీజీలు ఓపీ సేవలు అందిస్తున్నారు. 200 మంది ఓపీ రోగులు సేవల కోసం ఆస్పత్రి వచ్చేస్తున్నారు. రోగుల సంఖ్య అనుగుణంగా న్యూరో వైద్యుల సంఖ్యల పెంచాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.



కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని న్యూరో సర్జరీ విభాగం

అవసరం లేని చోట వైద్యులు

మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, మంచిర్యాల లాంటి జిల్లా ఆస్పత్రుల్లో న్యూరో సర్జరీ వైద్యులు కొనసాగుతున్నారు. అయితే ఇక్కడ ఆపరేషన్ థియేటర్లు, సర్జరీ పరికరాలు లేకున్నప్పటికీ న్యూరో సర్జరీ వైద్యులు కొనసాగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవసరం ఉన్న చోట న్యూరో సర్జరీ వైద్యులను నియమించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.





ఆలయంలో భక్తులకు ప్రసాదం అందజేస్తున్న ఈవో శేషభారతి

భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

వరంగల్ కల్చరల్, జూన్ 30 : వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తుల రద్దీ దృష్ట్యా దేవాలయం నుంచి భక్తులకు ఉచితంగా ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ఈవో శేషభారతి స్వయంగా భక్తులకు ప్రసాద వితరణ గావించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

పెన్షనర్ల సమస్యలపై ఉదాసీన వైఖరి విడనాడాలి

పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

మట్టెవాడ, జూన్ 30: తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీన వైఖరిని విడనాడాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిల్లా పెన్షనర్ల సంఘం సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమయ్య అధ్యక్షతన వరంగల్ ఎన్‌వీఎన్ రోడ్‌లోని ఏవీవీ కళాశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయకుండా తుంగలో తొక్కిందని విమర్శించారు. పెన్షన్‌దారులందరికి నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేటర్ ఆస్పత్రుల్లో అందేవిధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లను ఇవ్వడంతోపాటు పీఆర్‌సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, కుమారస్వామి, నిజాముద్దీన్, స్వయంప్రకాశ్, ఈశ్వరమూర్తి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఖిలావరంగల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నర్సింహస్వామి



నియామక పత్రం అందుకుంటున్న నర్సింహస్వామి

ఖిలావరంగల్, జూన్ 30: ఖిలావరంగల్ పద్మశాలి కుల సంఘం అధ్యక్షుడిగా బేతి నర్సింహస్వామి ఎన్నికయ్యారు. ఆదివారం 38వ డివిజన్ ఖిలావరంగల్‌లోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో జిల్లా బాధ్యులు ఆడెపు రవీందర్, వడ్నాల నరేందర్, గోరంటాల రాజుల ఆధ్వర్యంలో ఖిలావరంగల్ పద్మశాలి కుల సంఘం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్ష బరిలో బేతి నర్సింహస్వామి, గుర్రం కోటేశ్వర్ నిలబడ్డారు. నర్సింహస్వామికి 39 ఓట్లు రాగా, గుర్రం కోటేశ్వర్‌కు 21 ఓట్లు వచ్చాయి. దీంతో నర్సింహస్వామిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కాగా, ప్రధాన కార్యదర్శిగా బేతి రాజు, కోశాధికారిగా పసునూటి మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంతిని చక్రధర్, ప్రధాన కార్యదర్శి అడిగొప్పుల ధనుంజయ అధ్యక్షతన ఎన్నికలను సజావుగా నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఖిలావరంగల్ ప్రాంత పద్మశాలి కులస్థులు పాల్గొన్నారు.

మచ్చాపూర్‌లో ఒకరిపై దాడి

గీసుగొండ, జూన్ 30: మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన సునిల్, విక్రమ్‌లు అకారణంగా తనపై కర్రలు, కత్తితో దాడి చేసి కొట్టారని బాధితుడు బిల్లా భిక్షపతి తెలిపాడు ఆదివారం స్వగ్రామం మచ్చాపూర్ బస్టాండ్ వద్ద స్నేహితులతో కలిసి తాను మాట్లాడుతుండగా ఆకస్మాత్తుగా దాడి చేశారని భిక్షపతి వాపోయారు. స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేస్తుండగానే సునిల్, విక్రమ్‌లు కత్తితో పొడవగా చేతికి గాయం అయిందని చెప్పారు. కర్రలతో మెడ, ఛాతిపై కొట్టారని చెప్పారు. ఈ ఘటనపై గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా చికిత్స కోసం ఎంజీఎంకు పంపించినట్లు బాధితుడు తెలిపారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



గీసుగొండలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గీసుగొండ, జూన్ 30 : మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గతంలో ఇంటిస్థలం రాని 125 మంది భూ నిర్వాసితులకు ప్లాట్‌లు ఇప్పించేందుకు సీఎం దృష్టికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి విషయాన్ని తీసుకెళ్లి సానుకూలంగా ప్రకటన చేయించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు కొనాయిమాకులలో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. టెక్స్‌టైల్ పార్కు పైలాన్ వద్ద ఈ ప్లాట్‌లను ఇస్తామని టీజీఐఐసీ అధికారులు తెలిపారని వారు చెప్పారు. అదేవిధంగా భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించటం పట్ల వారు హర్షం వక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, ఎంపీటీసీ గోపాల్, నాయకులు కక్కెర్ల సుభాష్, పత్తిపాక రవీందర్, రాధిక, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

● సంగెం: మండల కేంద్రంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఇంటిస్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ప్రకటించడం పట్ల పలువురు కాంగ్రెస్ నేతలు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంగెం పరిధిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు రైతులు భూములను అందించగా ప్రతిఫలంగా ప్రభుత్వం వారందరికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు శనివారం సీఎం తన పర్యటనలో ప్రకటించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు మెట్టుపల్లి రమేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, యూత్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజుగౌడ్, సమన్వయ కమిటీ సభ్యుడు కందకట్ల నరహరి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బిక్కిరెడ్డి సంధ్య, నాయకులు కాగితాల జగన్నాథచారి, ఎంపీటీసీ మల్లయ్య, గుండెటి రాజ్‌కుమార్, గుగులోతు లక్ష్మణ్, సదయ్య, రామకృష్ణ, సాంబయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

పరపతి సంఘాలతో ఆర్థికంగా ఎదగాలి

శంభునిపేట, జూన్ 30 : పరపతి సంఘాలతో సభ్యులు ఆర్థికంగా ఎదగాలని అధ్యక్షుడు కేడల మల్లేశం అన్నారు. నగరంలోని రంగశాయిపేటలో గల జనతా పరపతి సంఘం 41వ వార్షికోత్సవం ఆదివారం సంఘం ఆవరణలో నిర్వహించారు. గత సంవత్సరం వార్షిక నివేదికను సభ్యులకు అందించారు. జనతా పరపతి సంఘం 1983లో వంద మంది సభ్యులతో ఏర్పాటు చేయగా ప్రస్తుతం 1,011 మంది ఉన్నారు. అనంతరం సంఘం వ్యవస్థాపకులు, శాశ్వత సభ్యులు చీకటి సమ్మయ్య, పోశాల సత్యనారాయణ, కొడిపాక సురేందర్‌బాబు, కత్తి కుమారస్వామి, శ్రీరాముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కేడల మల్లేశం, ఉపాధ్యక్షుడిగా పెరుమాండ్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా పోశాల మల్లికార్జున్, సహాయ కార్యదర్శిగా టీవీ రఘురాం, కోశాధికారిగా అనుమాండ్ల రమేష్, సహాయ కోశాధికారిగా నాగవెల్లి రామ్‌మనోహర్, ఆర్గనైజర్లుగా బత్తిని వీరభద్రయ్య, శెంకేశి కుమారస్వామి, విలాసాగరం శ్రీధర్‌లను ఎన్నుకోగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా జగిత్యాల జిల్లా కోర్టు న్యాయమూర్తి కంచె ప్రసాద్ పాల్గొనగా, పరిశీలకులుగా మండల పరుశ రాములు, బిట్ల సుధాకర్ వ్యవహరించారు.

మోదీ విధానాల వల్లే దేశం అభివృద్ధి : బీజేపీ



ప్రధాని మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

శంభునిపేట, జూన్ 30 : ప్రధాని నరేంద్ర మోదీ శక్తివంతమైన విధానాలు, నిర్ణయాలవల్లే దేశం అభివృద్ధి చెందుతూ పటిష్టంగా తయారైందని బీజేపీ నాయకుడు కర్నె రవీందర్ అన్నారు. వరంగల్ విశ్వనాథకాలనీలోని కార్యాలయంలో ఆదివారం ప్రధాని మన్‌కీ బాత్ 111వ సమావేశ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక, రక్షణ, ఆర్థిక రంగాలలో అభివృద్ధి చెంది ప్రపంచ దేశాలన్నింటికీ ఆదర్శంగా భారత్ నిలుస్తుందని అన్నారు. అందుకు ప్రధాని మోదీ పాలనే కారణమన్నారు. ఒక దేశానికి శక్తివంతమైన నాయకుడే ఆ దేశాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దగలరని మోదీని ఉదహరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, అందులో యువత భాగస్వాములు అవ్వాలని కోరారు. కార్యక్రమంలో 41వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్, కీర్తి అజేంద్ర, గోపి, సంజు, వరుణ్, రాజు పాల్గొన్నారు.

రైల్వే షూటింగ్ విజేతకు ఆర్‌పీఎఫ్ అభినందనలు



విజేత రజనీకుమార్‌ను అభినందిస్తున్న వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ,ఎస్సైలు

గిర్మాజీపేట, జూన్ 30 : అఖిల భారత అంతర్ రైల్వే షూటింగ్, తెలంగాణ 10వ రాష్ట్ర స్థాయి రైఫిల్, పిస్టోల్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన వరంగల్ రైల్వే రక్షిత దళం(ఆర్‌పీఎఫ్) హెడ్‌కానిస్టేబుల్ పి.రజనీకుమార్‌ను ఆదివారం వరంగల్ ఆర్‌పీఎఫ్ అభినందించింది. బిహార్ రాష్ట్రం దానాపూర్ రైల్వే డివిజన్‌లో జూన్ 19 నుంచి 23వ తేదీ వరకు జరిగిన అఖిల భారత అంతర్ రైల్వే షూటింగ్(రైఫిల్) పోటీల్లో పి.రజనీకుమార్ అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించారు. అలాగే తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ హైదరాబాద్ గచ్చిబౌలిలో జూన్ 26 నుంచి జూన్ 28 వరకు నిర్వహించిన తెలంగాణ 10వ రాష్ట్రస్థాయి ఎయిర్ పిస్టల్,ఎయిర్ రైఫిల్ షూటింగ్ విభాగాలలో రజనికుమార్ కాంస్య పతకం సాధించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాలు సాధించిన రజనీకుమార్‌ను వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠాణాలో సీఐ టి.ఎస్.ఆర్.కృష్ణ, ఎస్సై జి.వెంకటేష్, ఏఎస్సై ఎం.వెంకటేశ్వర్‌లతో పాటుగా ఆర్‌పీఎఫ్ సిబ్బంది అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయిలో రజనీకుమార్ రాణించి వరంగల్ ఆర్‌పీఎఫ్‌కు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం

పాల్గొన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం చేస్తున్న బస్వరాజు సారయ్య

వరంగల్ కల్చరల్, జూన్ 30: వరంగల్ ములుగు రోడ్డులోని వరద దత్తక్షేత్రంలో ఆదివారం దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొని స్వామి వారికి తైలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారికి తైలాభిషేకం నిర్వహించడంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర నాయకుడు చాడా శ్రీనివాస్‌రెడ్డి దత్తక్షేత్రాన్ని సందర్శించి స్వామి వారికి తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు రాపాక గోపీకృష్ణశర్మ స్వామి వారికి సుగంధ ద్రవ్యాలు, పాలు, తైలంతో అభిషేకం చేసి అలంకరణ చేశారు. భక్తులకు మహా మంగళహారతి ఆశీర్వచనం అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరాగా, తీర్థ ప్రసాద వితరణ చేసి మహా అన్నదానం గావించారు. ఆనందరెడ్డి దంపతులు భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ

● చైర్మన్ మహ్మద్ మొయినొద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న మొయినొద్దీన్

పోచమ్మమైదాన్, జూన్ 30 : ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిరుపేద విద్యార్థులకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ, డబ్ల్యూఈవో అండగా ఉంటుందని జాతీయ మానవ హక్కుల స్త్రీ, శిశు ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ మొయిరొద్దీన్ అన్నారు. గ్రేటర్ వరంగల్‌లోని మూడవ డివిజన్ ఆరెపల్లిలో ఆదివారం జాతీయ మానవ హక్కుల స్త్రీ, శిశు ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ సర్వసభ్య జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రభుత్వం బాధ్యతను గుర్తుచేయాలని సభ్యులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సంపెట సుధాకర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు విన్నకోట గోవర్ధన్, వేణు, రాజేష్, సుబ్రమణ్యం, విజయ్‌కుమార్, పరమేష్, రాజగోపాల్, రఘువీర్, నరేందర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ ర్యాలీ నిర్వహించిన సీఏలు



వరంగల్ చౌరస్తాలో వికసిత్ భారత్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఏలు

వరంగల్ చౌరస్తా, జూన్ 30: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వికసిత్ భారత్ ర్యాలీని వరంగల్ చౌరస్తాలో ఆదివారం నిర్వహించారు. వరంగల్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్స్ చేపట్టిన ర్యాలీ వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మమైదాన్ జంక్షన్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో చైర్మన్ భగవాన్‌దాస్ ముందాడ, కార్యదర్శి మాదారపు సుధీర్, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్ మన్నెం రామకృష్ణ, సీనియర్ సీఏలు వీవీ నారాయణరావు, ఓంప్రకాష్‌లోయ, కొయ్యాల రాజు, చెంచల్ అగర్వాల్, రాఘవరెడ్డి, రాజేష్‌బజాజ్, హరీష్‌లోయ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వరంగల్ సిటీ, జూన్ 30: నగరంలో జూలై 9, 10 తేదీల్లో జరిగే సీపీఐ రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆపార్టీ వరంగల్ మండల కార్యదర్శి బుస్స రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని కాశిబుగ్గ జంక్షన్‌లో బుస్స రవీందర్ అధ్యక్షతన రాజకీయ శిక్షణా తరగతుల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ శిక్షణా తరగతుల ద్వారా పార్టీ సిద్ధాంతం, ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామన్నారు. కొత్త పాత వారికి అవగాహన కల్పిస్తూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసేలా శిక్షణ తరగతుల్లో బోధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుండె భద్రి, సంద్ర కుమార్, మేడిది అశోక్, పరికరాల రమేష్, ఎండి.ఖాసీం, రహేలా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన రైతులు

ఖానాపురం, జూన్ 30: మండలంలోని ఖానాపురం, బుధరావుపేట, రాగంపేట, మనుబోతులగడ్డ గ్రామా లకు చెందిన రైతులు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సత్తుపల్లి, గంగారం, కాకర్లపల్లి, అశ్వరావుపేట గ్రామాల్లో సాగైన ఆయిల్‌పామ్ తోటల సందర్శనకు ఆదివారం తరలివెళ్లారు. జిల్లా ఉద్యాన వన అధికారి శ్రీనివాసరావు, డివిజన్ అధికారి జ్యోతి ఆధ్వర్యంలో తోటలను సందర్శించిన రైతులు పరుచూరి సుబ్బారావు, కర్ర కృష్ణారెడ్డి, కుంచారపు వెంకటరెడ్డి, వెంకటనారాయణ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల సాగులో మెలకువలు, పంట దిగుబడి, మార్కెటింగ్‌తో పాటు, తోటల్లో ఆంతర్గత పంటల సాగు విధానాలను తెలుసుకోవడానికి ఈ సందర్శన దోహదపడిందన్నారు. కార్యక్రమంలో రైతులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంధ్రాతి శ్రీను, ఎడ్ల వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులకు ఉరిశిక్ష విధించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల నేతలు

పోచమ్మమైదాన్, జూన్ 30: హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులకు చట్టరీత్యా ఉరిశిక్ష విధించాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రాయల అన్నారు. అత్యాచార ఘటనను నిందిస్తూ ఆదివారం వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాచారానికి గురైన బాలికకు సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బచ్చల స్వప్న, నేతవత్ లక్ష్మి, ఐరబోయిన అనూష, బగ్గి సరస్వతి, గూడె భార్గవి, రాసమల్ల భాగ్యశ్రీ పాల్గొన్నారు.



కరీమాబాద్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఖిలా వరంగల్‌లో పాల్గొన్న 1988-89 పదవ తరగతి పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీమాబాద్, జూన్ 30: వారంతా చిన్ననాటి స్నేహితులు. 26ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్నప్పుడు పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ అపూర్వ సమ్మేళనం ఆదివారం నగరంలోని ఉర్సు కరీమాబాద్‌లోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరంలో 10వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు నిర్వహించారు. వారికి చదువు నేర్పిన గురువులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మీ అందరిని మళ్లీ ఇన్ని సంవత్సరాలకు చూస్తుంటే గత స్మృతులు గుర్తుకొస్తున్నాయని, మీ అందరికి తమ ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. చాలా సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుకు కృషి చేసిన పూర్వ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

35ఏళ్ల తర్వాత..

ఖిలావరంగల్ : చిన్ననాటి జ్ఞాపకాలెన్నో మదిలో మెదలగా నగరంలోని క్రిస్టియన్‌కాలనీలో పదవ తరగతి విద్యార్థులు 35ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఆదివారం 18వ డివిజన్ క్రిస్టియన్‌కాలనీలోని గ్రెయిన్ మార్కెట్ హైస్కూల్‌లో 1988-89 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట కలిశారు. మామిడాల రమేష్‌బాబు అధ్యక్షతన తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సుభాష్, నర్సింహారావు, విజయ్‌కుమార్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తి, యోగక్షేమాలు, పిల్లల చదువు అడిగి తెలుసుకున్నారు. 40 మంది పాల్గొన్న కార్యక్రమంలో పూర్వవిద్యార్థులను శాలువా, మెమోంటోలతో సన్మానించారు. అనంతరం విందుభోజనాలు చేశారు. ముందుగా సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో బంక వెంకటేశ్వర్లు, కుడికాల సురేష్, శ్రీనివాస్, మంద సుధాకర్, విజయ్‌భాస్కర్ రెడ్డి, బండి రమేష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కవి రవీందర్‌కు సత్కారం

శంభునిపేట, జూన్ 30 : ప్రముఖ కవి, రచయిత గోపగాని రవీందర్‌ను ఖిలావరంగల్ మండలం తిమ్మాపురంలోని ఏకశిల యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం లైబ్రరీ హాల్‌లో ఘనంగా సత్కరించారు. 'మా ఊరు ఒక కావ్యం' అనే రచనలతో గ్రామ పరిసరాలు, చిన్ననాటి స్నేహితులు, జ్ఞాపకాలను కవితలుగా మలిచి తిమ్మాపూర్ గ్రామాన్ని, ప్రజలను అపురూపంగా చూపించటం పట్ల గ్రామానికి చెందిన పలువురు రవీందర్‌ను సత్కరించి అభినందించారు. రవీందర్ రచనలు తమకు గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో మందల జీవన్‌రెడ్డి, మేకల సూరయ్య, యాదగిరి, ఇల్లందుల వెంకటస్వామి, బీరం రామ్‌రెడ్డి, కల్వచర్ల భీమలింగం, సిరి సొసైటీ అధ్యక్షుడు రొడ్డ మురళీకృష్ణ, గోపగాని స్నేహసాగర్ తదితరులు పాల్గొన్నారు.



రవీందర్‌ను సత్కరిస్తున్న ఏకశిల యూత్ బాధ్యులు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 1 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన రైతులు



ఆయిల్‌పామ్ తోట వద్ద రైతులు

ఖానాపురం, జూన్ 30 : మండలంలోని ఖానాపురం, బుధరావుపేట, రాగంపేట, మనుబోతులగడ్డ గ్రామాలకు చెందిన రైతులు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సత్తుపల్లి, గంగారం, కాకర్లపల్లి, అశ్వరావుపేట గ్రామాల్లో సాగైన ఆయిల్‌పామ్ తోటల సందర్శనకు ఆదివారం తరలివెళ్లారు. జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, డివిజన్ అధికారి జ్యోతి అధ్వర్యంలో తోటలను సందర్శించిన రైతులు పరుచూరి సుబ్బారావు, కర్ర కృష్ణారెడ్డి, కుంచారపు వెంకటిరెడ్డి, వెంకటనారాయణ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల సాగులో మెలకువలు, పంట దిగుబడి, మార్కెటింగ్‌తో పాటు, తోటల్లో ఆంతర్గత పంటల సాగు విధానాలను తెలుసుకోవడానికి ఈ సందర్శన దోహదపడిందన్నారు. కార్యక్రమంలో రైతులు భైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంధ్రాతి శ్రీను, ఎడ్ల వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



సాయిరెడ్డిపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి

నెక్కొండ, జూన్ 30 : అభివృద్ధి పనుల్లో భాగంగా నర్సంపేట నియోజక వర్గంలో రోడ్ల నిర్మాణానికే మొదటి ప్రాధాన్యత అన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు, ఆదివారం మండలంలోని సాయిరెడ్డిపల్లిలో రూ.4 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్కా రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. నూతనంగా గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు ప్రజలు పనులను పర్యవేక్షించడం వల్ల కాంట్రాక్టర్లు నాణ్యతను పాటిస్తారన్నారు. ప్రజలు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించడంలో కార్యకర్తలు ముందుండాలన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, ఎంపీటీసీ బండారుపల్లి వినయకుమారిశ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు చల్లా శ్రీపాల్‌రెడ్డి, కుసుమ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంఎస్‌పీ, డీబీఆర్‌పీఎస్ బృందం

నర్సంపేట, జూన్ 30 : అమెరికా, కెనడా దేశాలలో పర్యటన ముగించుకొని ఇటీవల నర్సంపేటకు చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ), డీబీఆర్‌పీఎస్ ప్రతినిధి బృందం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి బుద్ధుడి చిత్రపటం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కల్లెపెల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ, డీబీఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు అందె రవిమాదిగ మాట్లాడుతూ అమెరికా, కెనడా దేశాల్లోని తెలుగు ప్రజలతో వ్యవసాయ విధి విధానాలపై ఎమ్మెల్యే అవగాహన చేసుకొని దానిపై క్లుప్తంగా వివరించి వారి మెప్పును పొందారన్నారు. నర్సంపేట అభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి ఎమ్మెల్యే దొంతి తన శాయశక్తులా కృషి చేస్తారని అన్నారు. 44 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించిన గొప్ప నేత దొంతి మాధవరెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సరోజన, రేణుక, నారాయణ, వీరేశం, శ్రీకాంత్, సుధాకర్, భిక్షం, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమ నూతన కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట, జూన్ 30 : మండల వయోవృద్ధుల సంక్షేమ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని జాగృతి ఉన్నత పాఠశాలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఈగ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా వరంగంటి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ములక సాంబయ్య, కేతిడి సమ్మిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కాసుల నర్సింహాచారి, అడువ సత్తయ్య, తాల్లపెల్లి కొమ్మాలు, కోశాధికారిగా వరంగంటి కుమారస్వామి, సంయుక్త కార్యదర్శిగా ముత్యం సాంబయ్య, గట్ల క్రిష్ణయ్య, కార్యవర్గ సభ్యులుగా దొనికల వీరయ్య కంది నారాయణ రెడ్డి, ఉపేంద్రచారి, రాదారాపు ప్రతాప్‌రెడ్డి, కోరే కట్టయ్య, ముఖ్య సలహాదారులుగా సిద్ధ కుమారస్వామి, పత్తి సంజీవరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'వెంచర్'పై వివాదం

నిబంధనలు పాటించలేదనే విమర్శలు

గ్రామ పంచాయతీ అనుమతిపై మీమాంస

వెంచర్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

సమాచారం లేదంటున్న ఉన్నతాధికారులు



ఇల్లందలో ఓ వెంచర్‌లో నిర్మాణం చేస్తున్న కట్టడం



ఎలాంటి బోర్డు లేకుండా ప్లాట్లకు వెళ్లే దారికి చేసిన ఆర్చీ నిర్మాణం

వర్ధన్నపేట రూరల్, జూన్ 30 : మండలంలోని ఇల్లంద గ్రామంలో కక్కిరాలపెల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్ అనుమతులు వివాదానికి దారి తీస్తోంది. డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) పేరిట ఏర్పాటు చేసిన లే అవుట్ పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటను వెంచర్‌గా మార్చి అందులో ప్లాట్లను చేసి రాళ్లను నాటిన నిర్వాహకులు ప్రభుత్వ అనుమతులు తీసుకోవడంలో నిబంధనలు అతిక్రమించినట్లుగా తెలుస్తోంది. ఓ అధికారిని మచ్చిక చేసుకుని లే అవుట్ చేసి, వాటిలో అక్రమ నిర్మాణాలు ప్రారంభించారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఖజానాకు భారీగా గండిపడుతోంది. డీటీసీపీ అనుమతి హైదరాబాద్‌లో తీసుకున్నామని డాక్యుమెంట్లు చూపినప్పటికీ, స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన అనుమతులు ఉన్నాయా? లేదా అనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. దీనిపై సంబంధిత మండల ఎంపీడీవో, ఎంపీవో అధికారులను వివరణ కోరగా విషయం తమకు తెలియదంటూ చెబుతున్నారు.

డీటీసీపీ నుంచి అనుమతి తీసుకున్న నిర్వాహకులు.. గ్రీనరీ కోసం కొంత స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన స్థలం కాలువ అవతల కొంత స్థలం ఉండగా, మరికొంత స్థలం మధ్యలో ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. కానీ, డీటీసీపీ అనుమతి పొందకముందే గ్రామ పంచాయతీ అధికారులు ఎక్కడ వారికి స్థలం కావాలో, ఎందుకు నిర్ణయించుకోలేదో అర్థం కావడం లేదు. దీనికి తోడు సంబంధిత ఇరిగేషన్, ఇతర అధికారుల నుంచి పూర్తిస్థాయి అనుమతులు ఉన్నాయో లేదో కూడా పంచాయతీ అధికారులు చెప్పడం లేదు. డీటీసీపీ నుంచి దరఖాస్తు ఆన్‌లైన్‌లో రావడంతో పాటు పంచాయతీ కార్యదర్శికి రిజిస్ట్రేషన్ చేసినట్లుగా రికార్డులు ఉన్నప్పటికీ, స్థానిక ఎంపీడీవో లాగిన్ నుంచి మాత్రం 'పేమెంట్ కంప్లీటెడ్ అండ్ వెయిటింగ్ ఫర్ సర్టిఫికెట్ అప్‌లోడ్' అంటూ కనిపిస్తోంది. దీనిపై అధికారులను ప్రశ్నించగా తమకేలాంటి సమాచారం లేదంటూ చెపుతున్నారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' ఎంపీడీవో, ఎంపీవో, ఇరిగేషన్ అధికారులను సైతం వివరణ కోరింది.

ప్రత్యేక అధికారికి తెలుసా..?

ఇల్లంద గ్రామానికి ప్రత్యేకాధికారిగా స్థానిక తహసీల్దార్‌ను నియమించారు. సర్పంచుల పదవీకాలం పూర్తయిన తర్వాత ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. అప్పటి నుంచి గ్రామాల్లో ఎలాంటి పనులు చేసినా, అనుమతులు తీసుకున్నా ప్రత్యేక అధికారికి సమాచారం ఉండడంతోపాటు ఆయన అనుమతి ఉండాలి. మరీ వెంచర్ల అనుమతులు, గ్రామ పంచాయతీకి రాసిచ్చిన గ్రీనరీ స్థలంపై పూర్తివివరాలు ప్రత్యేక అధికారికి తెలిసి జరిగిందా? తెలియకుండా జరిగిందా? అనే విషయంపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ఎలాంటి తీర్మానాలు, అనుమతులు లేకుండానే ఆన్‌లైన్‌లో కూడా అనుమతులు లేకుండా సంబంధిత వెంచర్ నిర్వాహకులు ప్లాట్లు చేయడంతో పాటు నిర్మాణాలు చేయడంపై ఎవరి హస్తంఉందనే దానిపై స్పష్టతరావాల్సి ఉంది.

లే అవుట్ విషయం తెలియదు..

వెంకటరమణ, ఎంపీడీవో వర్ధన్నపేట

ఇల్లందలో ఏర్పాటు చేస్తున్న డీటీసీపీ లే అవుట్ నాకు తెలీదు. ఆ స్థలాన్ని సైతం నేను పరిశీలించలేదు. సంబంధిత అనుమతులు, వాటి వివరాలు కూడా నాకు చెప్పలేదు. పూర్తిస్థాయిలో గ్రామ కార్యదర్శిని విషయం తెలుసుకుని వివరణ ఇస్తాను.

సమాచారం లేదు..

ధనలక్ష్మి, ఎంపీవో, వర్ధన్నపేట

ఇల్లందలో ఏర్పాటు చేసిన వెంచర్ల సమాచారం లేదు. దానిపై కార్యదర్శి వివరణ ఇవ్వాలని అడుగుతాను. నిర్మాణాలు చేయాల్సి వస్తే తప్పకుండా అనుమతులు తీసుకోవాలి. గ్రామ పంచాయతీకి చేసిన గ్రీనరీ స్థలం కూడా ఎక్కడ ఉందో తెలియదు.

త్వరలో నర్సంపేట మార్కెట్ కమిటీ నియామకం

నర్సంపేట, జూన్ 30: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలక వర్గాలను నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. వ్యవసాయ మార్కెట్‌లకు త్వరలో పాలకవర్గాలను ప్రకటిస్తామని ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇందుకు సంబంధించి మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు ప్రకటించింది. నర్సంపేట నియోజక వర్గంలో నర్సంపేట, నెక్కొండలో రెండు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. వీటిలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ బీసీలకు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌ను జనరల్‌కు కేటాయించారు. ఇటీవల నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకాన్ని ప్రభుత్వం భర్తీ చేసింది. జిల్లాలోనే ఎనమాముల మార్కెట్ తర్వాత ఆదాయాన్ని సమకూర్చిపెట్టే నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం ఎప్పుడు చేపడుతారోనని రైతులు, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. 22ఎకరాల సువిశాలమైన స్థలంలో నాలుగు తూకం షెడ్లు, గోదాములు, కవర్‌షెడ్లు,



షాపింగ్ కాంప్లెక్స్, రైతు విశ్రాంతి భవనం కలిగి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచే నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందోనన్న చర్చ జోరుగా సాగుతుంది. కొంత మంది కాంగ్రెస్ నాయకులు చైర్మన్ పీఠంపై ఆశలు పెంచుకొని ప్రయత్నాలు సాగిస్తున్నా, నర్సంపేటకు చెందిన పాలాయి శ్రీనివాస్‌కే చైర్మన్ పదవి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు అంటున్నారు.

ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నవారికే చైర్మన్ పీఠం!

ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్న వారికే నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దక్కే అవకాశాలు ఉన్నాయి. దీంతో నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట మండలాలకు చెందిన బీసీ నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. 12మంది డైరెక్టర్లను కూడా నియమించాల్సి ఉంటుంది. ఈ పదవులనైనా దక్కించుకోవాలని కొందరు అధికార పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కెట్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని నర్సంపేటకు చెందిన మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కోరినట్లు సమాచారం. ఎమ్మెల్యేకు సన్నిహితంగాఉండే మాజీ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్‌కు ఇచ్చిన హామీ మేరకు ఇతనికే మార్కెట్ చైర్మన్ పదవిని కేటాయించే అవకాశాలు ఉన్నాయి. పాలాయి శ్రీనివాస్‌కే మార్కెట్ చైర్మన్ పీఠం దక్కనుంది. ప్రభుత్వానికి మార్కెట్ పాలకవర్గం జాబితా వెళ్లిందని, త్వరలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 12మంది డైరెక్టర్ల పేర్లతో కమిటీని ప్రకటించనున్నట్లు తెలిసింది.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన జనగామ డీసీపీ



ఫిర్యాదుదారు మహిళతో మాట్లాడుతున్న డీసీపీ

వర్ధన్నపేట, జూన్ 30 : వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌ను జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి 100 డయల్ కేసుల్లో తక్షణమే స్పందించాలని ఏసీపీ, ఎస్ఐలకు సూచించారు. అంతేకాకుండా పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని పేర్కొన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి త్వరితంగా పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తూ జాగ్రత్తగా ఉండేలా చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో బ్లూకోర్టు సిబ్బంది గస్తీ నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ ఆవరణలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళలతో మాట్లాడిన అనంతరం వర్ధన్నపేట అంబేడ్కర్ సర్కిల్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నర్సయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గొండి, జూన్ 30 : మండలంలోని నాచినపల్లిలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన బండారి లక్ష్మణ్ కుటుంబానికి గిర్నిబావిలోని శ్రీచైతన్య గురుకులంలో 2000-2001లో పదో తరగతి చదివిన స్నేహితులు ఆదివారం రూ:1,00,000లు ఆర్థిక సాయం చేశారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

దుగ్గొండి, జూన్ 30 : వానాకాల పంట సాగుపై రైతులు సస్యరక్షణ చర్యలు పాటించి పంట దిగుబడి పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాల్ సూచించారు. మండలంలోని మందపల్లి సహకార సంఘం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఉషాదయాల్ పాల్గొని మాట్లాడుతూ పంటల సాగు చేసిన నాటి నుంచి పంటలకు తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కన్సల్‌టెంట్ పి.సారంగం, శ్రీధర్, విజయనాయక్, సంఘం ఉపాధ్యక్షుడు కార్తిక్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం

వర్ధన్నపేట, జూన్ 30 : నీట్‌ను రద్దు చేయకుంటే విద్యార్థులు, మేధావులు, ఉద్యమకారులతో ఉద్యమం ఉధృతం చేస్తామని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో డీఎన్ఎస్ఎస్ జిల్లా సదస్సు మునిగాల అరుణ్ అధ్యక్షతన నిర్వహించగా కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో చల్లా మిథిన్, అనిల్‌కుమార్, తిరుమలేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురి సస్పెన్షన్

నెక్కొండ, జూన్ 30 : మండలంలోని పెద్దకొర్పోలు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న మెండె రవి, దయ్యాల ఐలయ్య, బీరు కమలహాసన్‌లను పార్టీ నుంచి సస్పెన్షన్ చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు భీమన్న అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే, వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గై లక్ష్మణ్, షైపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పడాల రవి, కర్ర చెన్నారెడ్డి పాల్గొన్నారు.

జ్వరంతో చికిత్స పొందుతున్న విద్యార్థికి పరామర్శ

దుగ్గొండి, జూన్ 30 : మండలంలోని గిర్నిబావిలో మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర విద్యాలయంలో 6వ తరగతి చదువుచున్న ఓరుగంటి జస్వంత్ వారం రోజులు గా జ్వరంతో బాధపడుతూ నర్సంపేట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ ఆదివారం సందర్శించి పరామర్శించారు. పరామర్శిం చిన వారిలో ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్, రాజు ఉన్నారు.

మేరు సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఖానాపురం, జూన్ 30 : మండలంలోని బుధరావుపేట మేరు కులసంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందగిరి రజనీకాంత్,ఉపాధ్యక్షులుగా సింగు అశోక్, సింగు బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా గూడూరు యాకవీరేందర్, కార్యదర్శులుగా గట్ల యుగేందర్, నందగిరి శ్రీను, నిర్వహణ కార్యదర్శులుగా సింగు రాజయ్య, సింగు లక్ష్మయ్య పోల్కం లక్ష్మీనారాయణ, వెన్ను రామయ్య, కీర్తి గట్టేష్, సింగు వెంకటేశ్వర్లు, కోశాధికారులుగా రమేష్, క్రిష్ణమూర్తిలను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చెన్నారావుపేట, జూన్ 30 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ. సాంబయ్య జనార్ధన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

గీసుగొండ, జూన్ 30 : మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గతంలో ఇంటిస్థలం రాని 125మంది భూ నిర్వాసితులకు ప్లాట్లు ఇప్పించేందుకు సీఎం దృష్టికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి విషయాన్ని తీసుకెళ్లి సానుకూలంగా ప్రకటన చేయించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు కొనాయిమాకులలో ఆదివారం క్షీరాభిషే కం చేశారు. టెక్స్‌టైల్ పార్కు పైలాన్ వద్ద ఈ ప్లాట్‌లను ఇస్తామని టీజీఐఐసీ అధికారులు తెలిపారని చెప్పారు. అదేవిధంగా భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించటం పట్ల హర్షం వక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, ఎంపీటీసీ గోపాల్, నాయకులు కక్కెర్ల సుభాష్, పత్తిపాక రవీందర్, రాధిక, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



గీసుగొండలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

• సీఎం చిత్రపటానికి..

సంగెం : సంగెం మండల కేంద్రంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఇంటిస్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ప్రకటించడం పట్ల పలువురు కాంగ్రెస్ నేతలు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంగెం పరిధిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు రైతులు భూములను అందించగా ప్రతిఫలంగా ప్రభుత్వం వారందరికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు శనివారం సీఎం తన పర్యటనలో ప్రకటించారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు మెట్టుపల్లి రమేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, యూత్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజుగౌడ్, సమన్వయ కమిటీ సభ్యుడు కందకట్ల నరహరి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బిక్కిరెడ్డి సంధ్య నాయకులు కాగితాల జగన్నాథచారి, ఎంపీటీసీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీబాత్‌ను వీక్షించిన కొండేటి



మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట, జూన్ 30 : దేశ ప్రధాని నరేంద్రమోదీ దేశ భవిష్యత్, అభివృద్ధి, దేశ పౌరులు వారివారి రంగాల్లో సాధించిన విషయాల గురించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని వారి సొంత బూత్ 203లో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజు, ఉపాధ్యక్షుడు గిరిప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఐత రవికుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లెపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



శైలజ

చెన్నారావుపేట, జూన్ 30 : మండలంలోని జోజిపేట నారాయణతండాకు చెందిన బానోతు శైలజ (25)అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై గూడ మహేందర్ ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన శైలజ తన భర్త సుధాకర్‌తో ఈ నెల 29న గొడవ పడింది. తనతో ఉన్న ఇద్దరు పిల్లలు వర్షిత(5), అభిషేక్(3)లను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. శైలజ కోసం ఇంటి చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శైలజ తండ్రి గుగులోతు రాంజ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాన్ షాపులో చోరీ

చెన్నారావుపేట, జూన్ 30 : మండలంలోని జల్లిలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న పాన్ షాపులో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన ఎలకట్టి కృష్ణ బస్‌స్టాండ్ సమీపంలో పాన్‌షాపు పెట్టుకున్నాడు. రోజు వారి మాదిరిగానే పాన్‌షాపునకు శనివారం రాత్రి తాళం వేసి వెళ్లాడు. ఈ క్రమంలోనే అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బాకు ఉన్న తాళాన్ని పగలగొట్టి అందులో ఉన్న కూల్ డ్రింక్స్‌తో పాటు సిగిరెట్లు, బిస్కెట్లు ప్యాకెట్లు, తినుబండరాలు రూ.7 వేల విలువ చేసే సామగ్రిని అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



శివ (ఫైల్)

ఖానాపురం, జూన్ 30 : క్రిమి సంహారక మందు సేవించి చికిత్స పొందుతూ ఆదివారం ఒకరుమృతి చెందారు. ఎస్సై రఘుపతి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన, ఓ దినపత్రిక విలేఖరి మానె పల్లి శివ (35) ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 28న ఖానాపురం శివారులోని పాకాల ఆయకట్టు రోడ్డు వద్ద పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమా చారం అందుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆది వారం మృతి చెందాడు. శివ సివిల్ సప్లయిస్ ఆఫీసులో ఉద్యోగం కోసమని రెండు దఫాలుగా సుమారు రూ.4 లక్షలు తండ్రి వెంకన్న నుంచి తీసుకువెళ్లి దుబార చేయ గా, డబ్బుల విషయంలో తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

వర్ధన్నపేట రూరల్, జూన్ 30 : మండలంలోని కట్ర్యాలకు చెందిన హోంగార్డు రాయపురపు రాములు ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మృతిచెందగా, ఆదివారం ఆయన కుటుంబానికి తోటి హోంగార్డులు ఆర్థికసాయం అందించారు. వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాములు వ్యక్తిగత పనుల కోసం వెళ్లి వస్తుండగా గ్రామ శివారులో మృతి చెందాడు. ఈ సందర్భంగా మామూనూర్ సబ్ డివిజన్ హోం గార్డ్స్ ఆధ్వర్యంలో రూ.30,200 ఆర్థిక సాయం మృతుడి కుటుంబానికి అందించారు. హోం గార్డులు ఏలియా, రవి, బాస్కర్, చిరంజీవి తదితరులు ఉన్నారు.